క్లుప్తంగా

ఎమ్మెల్సీ నర్తుకు అభినందనలు


ఎమ్మెల్సీ రామారావును అభినందిస్తున్న రైతాంగ ప్రతినిధులు

కంచిలి: నియోజకవర్గ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను శాసన మండలి వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో విజయవంతమయ్యారని ఎమ్మెల్సీ నర్తు రామారావును నియోజకవర్గ రైతాంగ ప్రతినిధులు అభినందించారు. ఈ మేరకు ఎమ్మెల్సీని బుధవారం తన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛాలతో ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్సీని కలిసినవారిలో బీన ఢిల్లీరావు, జానకిరావు, పాపారావు, దేవరాజు తదితరులు ఉన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ


పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈవో వెంకటరమణ

వజ్రపుకొత్తూరు రూరల్: విద్యార్థులకు అవసరమైన రెండో సెమిస్టర్ పాఠ్య పుస్తకాలు మండల విద్యా వనరుల కేంద్రానికి చేరాయి. దీంతో బుధవారం మండల విద్యాశాఖాధికారి వెంకట రమణ సమక్షంలో పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు రెండో విడతగా 20,053 పాఠ్య పుస్తకాలు చేరాయన్నారు. ఆయనతో పాటు సీఆర్పీలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు


గాయపడిన కృష్ణారావు

టెక్కలి రూరల్: స్థానిక పాత జిల్లా ఆస్పత్రి సమీపంలో బుధవారం ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నౌపడ నుంచి టెక్కలి వైపు జి.కృష్ణారావు అనే యువకుడు తన ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. బైకు పాత జిల్లా ఆస్పత్రి వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో కృష్ణారావు తలకి తీవ్రగాయాలయ్యాయి. దీంతో వెంటనే టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

ఆర్థిక సాయం అందజేత


ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి: మండలంలోని వడ్డివాడ గ్రామానికి చెందిన ఇప్పిలి శాంతమ్మ కుమార్తె దీపికకు వల్లేవలస మనబడి అసోసియేషన్ సభ్యులు రూ.10,000 ఆర్థిక సాయం బుధవారం అందజేశారు. ఇటీవల టెక్కలి దగ్గర రోడ్డు ప్రమాదంలో దీపిక తీవ్రంగా గాయపడి రెండు కాళ్లు విరిగిపోవడంతో శ్రీకాకుళంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. కార్యక్రమంలో మనబడి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రెడ్డి సూరిబాబు, గేదెల శివారెడ్డి, ఇప్పిలి అప్పన్న, బోడాల శంకర్, జడ్డన్న స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా మహరణ


డి.మహరణ

పలాస: ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా పలాసకు చెందిన సీనియర్ జర్నలిస్టు డి.మహరణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజస్థాన్‌లో రెండు రోజులు పాటు జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశాల్లో ఐజేయూ అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి, సెక్రటరీ జనరల్ బల్విందర్ సింగ్, ఐజేయూ నూతన కమిటీ సెక్రటరీ డి.సోమసుందర్, ఏపీ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్, జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లిధర్మారావు, 17 రాష్ట్రాలకు చెందిన కార్యవర్గ సభ్యులు పాల్గొన్న ఈ సమావేశంలో మహరణను జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నుకున్నారు. ఆయనను పలాస – కాశీబుగ్గ ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు సీహెచ్ జగదీష్, కొంచాడ రవి, నేతాజీ తదితరులు అభినందించారు.

ప్రత్యేక ఆధార్ క్యాంపులు

పలాస: జాతీయ తపాల శాఖ వారోత్సవాల్లో భాగంగా కాశీబుగ్గ సబ్ డివిజన్‌లోని కాశీబుగ్గ, పలాస పోస్టాఫీసుల్లో ప్రత్యేక ఆధార్ నమోదు క్యాంపులు నిర్వహిస్తున్నట్లు కాశీబుగ్గ సబ్ డివిజన్ హెడ్ ఎ.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. కొత్త ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్ వంటి ఆధార్ సేవలను ఉచితంగా పొందవచ్చన్నారు. ఈ సేవలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటాయని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సేవలు సరే.. సిబ్బంది ఏరీ..?


లింగాలవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- లింగాలవలస పీహెచ్‌సీని వేధిస్తున్న సిబ్బంది కొరత
- ఇబ్బందులు పడుతున్న రోగులు
- పట్టించుకోని అధికారులు

టెక్కలి: గ్రామస్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అనేక చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగానే టెక్కలి మండలానికి శివారు పంచాయతీ కేంద్రం లింగాలవలస గ్రామానికి సుమారు రూ.2.30 కోట్లతో 2023 ఆగస్టులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేశారు. ఈ ప్రాంతంలో 30 ఏళ్ల కలగా ఉన్న ఆరోగ్య కేంద్రం స్థానిక సర్పంచ్ చొరవతో కొద్దిరోజుల్లోనే నిర్మాణం పూర్తి చేసుకుంది. ఇదే సమయంలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో పీహెచ్‌సీ ప్రారంభం నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. అయితే అంతా బాగానే ఉన్నప్పటికీ ప్రస్తుతం పీహెచ్‌సీలో సిబ్బంది కొరత వేధిస్తోంది. పీహెచ్‌సీ ప్రారంభించి నెలలు గడుస్తున్నప్పటికీ కీలకమైన సేవలు అందజేయాల్సిన సిబ్బంది నియామకాలు జరగలేదు. దీంతో ఈ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అరకొరగా అందుతున్నాయి. అంతే కాకుండా గ్రామాలకు అనుకుని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉన్నప్పటికీ కొన్ని రకాల వైద్య సేవల కోసం టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిపై ఆధారపడాల్సి వస్తోంది.

పూర్తిస్థాయిలో అందని సేవలు

లింగాలవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో లింగాలవలస, సార్లిగాం, పోలవరం, తిర్లంగి, భీంపురం, సవర సార్లిగాం, రంగాపురం, మెట్టపేట, ఏనేటిపేట, సతివాడ, సన్యాసిపేట, రాధావల్లభాపురం, లక్ష్మీపురం, గంగాధరపేట, నీలాపురం, వీఆర్‌కే పురం, బొరిగిపేట, సీతాపురం, మేఘవరం, వంగర తదితర గ్రామాలు ఉన్నాయి. అయితే ప్రస్తుతం ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్టు, ఎఫ్ఎన్‌వో, నైట్ వాచ్‌మెన్, స్వీపర్స్‌తో పాటు ఆపరేషన్‌కు అవసరమైన కొన్ని రకాల పరికరాలు లేకపోవడంతో ఉన్న కొద్దిపాటి సిబ్బంది ఇబ్బందులతో పాటు రోగులకు పూర్తిస్థాయి సేవలు అందడం లేదు. ఇద్దరు డాక్టర్లు, ముగ్గురు స్టాఫ్ నర్స్‌లపై కీలకమైన సేవల భారం పడుతోంది.

పూర్తిస్థాయిలో నియమించాలి



మా ప్రాంతం పరిధిలో ఉన్న గ్రామాలకు వైద్య సేవల కోసం ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించి వైద్య సేవలు అందజేయాలి. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు వలన చుట్టుపక్కల గ్రామాలకు ఎంతో మేలు కలుగుతోంది. ఉన్నతాధికారులు స్పందించి సిబ్బందిని నియమించి పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందేవిధంగా చూడాలి.

– డి.కూర్మారావు, ఎంపీటీసీ, పోలవరం

మా దృష్టికి వచ్చింది

లింగాలవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పూర్తిస్థాయిలో సిబ్బంది లేరనే విషయం మా దృష్టికి వచ్చింది. ఇదే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అయితే ఏ ప్రాతిపదికన సిబ్బందిని నియమించాలి అనే విషయంపై ఆలోచన చేస్తున్నారు.

– మేరీ కేథరిన్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో, టెక్కలి

• పరామర్శ


భైరాగి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీపీ దేవదాస్ రెడ్డి తదితరులు

కంచిలి: మండలంలోని ఎక్కల గ్రామానికి చెందిన కాతిల భైరాగి(78) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. అదేవిధంగా సోంపేట పట్టణానికి చెందిన శైలజా రైస్ మిల్ యజమాని పూనా శైలజ(53) ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందారు. దీంతో వీరి కుటుంబాలను స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి మండల పార్టీ నేతలతో కలిసి బుధవారం పరామర్శించారు. ఆయనతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, నియోజకవర్గ పార్టీ ఐటీ విభాగం అధ్యక్షుడు బెందాళం శోభన్‌బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ లద్దుకేశవపాత్రో, మండల పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు మద్దు అభియాదవ్, రంగాల శ్రీనివాసరావు, మండల యువజన కమిటీ ఉపాధ్యక్షుడు రంగాల దీనబంధు, కాతిల రాఘవులు, నెయ్యిల రుషి, కొంతాల లోహిదాస్, కాతిల జగదీష్, రంగాల విశ్వనాథం, కాతిల వసంతరావు తదితరులు ఉన్నారు.

జగన్ పర్యటన విజయవంతం చేయాలి

కవిటి: మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడానికి కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టడానికి వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం నర్సీపట్నం పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. గత ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందనే కుట్రతో వైద్య కళాశాలలు ప్రైవేటు పరం చేసేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ విధానాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. వెనుకబడిన ప్రజల కోసం జగన్ చేస్తున్న పోరాటానికి అన్ని వర్గాల వారు మద్దతు పలకాలని కోరారు.

టెక్కలి: మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న అనకాపల్లి జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని సంతబొమ్మాళి జెడ్పీటీసీ పాల వసంత్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వంలో పేదోడి గడప ముంగిటకే వైద్యం తీసుకొచ్చిన గొప్ప వ్యక్తి జగన్‌మోహన్ రెడ్డి అని గుర్తు చేశారు. మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయకుండా పేద, సామాన్య వర్గాల కోసం పోరాటం చేస్తున్న క్రమంలో అనకాపల్లి జిల్లా భీమబోయనపాలెంలోని మెడికల్ కళాశాల సందర్శనకు రానున్న వైఎస్ జగన్ పర్యటనకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సామాన్య ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

దాడికి యత్నించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి


నిరసన తెలియజేస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు

టెక్కలి: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నించిన లాయర్ రాకేష్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం టెక్కలిలో దళిత, ప్రజా, ఉపాధ్యాయ సంఘాలు నిరసన చేపట్టారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై ఇటువంటి దాడులు చేయడం అనైతిక చర్య అని పేర్కొన్నారు. దాడికి పాల్పడిన లాయర్‌పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనల వెనుక కొన్ని అరాచక శక్తులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో చల్లా రామారావు, కె.దాలయ్య, బి.ప్రభాకరరావు, ఎ.రాహుల్, పి.చిన్నారావు, హెచ్.ఈశ్వరరావు, కె.ఎల్లయ్య, కె.కామేశ్వరరావు, జె.బాబురావు, కె.ధర్మారావు, బి.గోపాలరావు, పి.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు భద్రతేదీ..?


వాహనాల పార్కింగ్ సేవలు లేకపోవడంతో ఎక్కడికక్కడే నిలిపిన ద్విచక్ర వాహనాలు

- ఆర్టీసీ కాంప్లెక్స్‌లో కనిపించని పార్కింగ్ స్థలం
- చోరీకి గురవుతున్న వాహనాలు
- ఆందోళన చెందుతున్న ప్రయాణికులు

టెక్కలి: కొద్ది రోజుల క్రితం టెక్కలికి చెందిన ఒక వ్యక్తి తన ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో పార్కింగ్ చేసి విశాఖపట్టణం వెళ్లారు. తిరిగి వచ్చేసరికి ఆయన వాహనం చోరీకి గురైంది. అయితే కాంప్లెక్స్ ఆవరణలో పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో సమీపంలో వాహనాన్ని పార్కింగ్ చేయడం వలనే వాహనం చోరీకి గురయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ ఆ వాహనం దొరకలేదు. టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో వాహనాల పార్కింగ్ సేవలు లేకపోవడంతో ప్రతిరోజూ ఎంతోమంది ఇతర ప్రాంతాలకు ఉద్యోగం, వ్యాపారం, ఉపాధి కోసం ప్రయాణం చేస్తున్న వారంతా తమ వాహనాలను అభద్రత ప్రదేశంలో పార్కింగ్ చేస్తూ భయాందోళనకు చెందుతున్నారు. ఖరీదైన వాహనాలను ఎండలో.. వానలో పార్కింగ్ చేస్తూ బిక్కుబిక్కుమంటున్నారు. కాగా కాంప్లెక్స్ ఆవరణలో గతంలో వాహనాల పార్కింగ్ సేవలు ఉండేవి. ప్రస్తుతం ఆయా సేవలను నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందువలన ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి పార్కింగ్ సేవలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

భయమేస్తోంది

టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో వాహనాలు పార్కింగ్ చేసి వివిధ పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే భయమేస్తోంది. ఇక్కడ వాహనాల పార్కింగ్ కోసం స్టాండ్ లేకపోవడం ఇబ్బందికరమైన విషయం. గతంలో ఇటువంటి పరిస్థితి ఉండేది కాదు. అధికారులు స్పందించి కాంప్లెక్స్ ఆవరణలో వాహనాల పార్కింగ్‌కు స్టాండ్ ఏర్పాటు చేయాలి.

– కె.సురేష్, చిరు వ్యాపారి, టెక్కలి

సర్వసభ్య సమావేశం వాయిదా


ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

వజ్రపుకొత్తూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరగాల్సిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశానికి మధ్యాహ్నం 12 గంటలు దాటినా ఎంపీటీసీ సభ్యులు పూర్తిస్థాయిలో హాజరు కాలేదు. ఎంపీడీవో నడిమింటి రమేష్‌నాయుడు, ఉప తహసీల్దార్ మురళీకృష్ణ, ఐదుగురు ఎంపీటీసీ సభ్యులు, కొంతమంది సర్పంచ్‌లు సమావేశ మందిరంలో వేచి చూసినా సభ్యులు హాజరవ్వకపోవడంతో గురువారానికి వాయిదా వేశారు. వాస్తవానికి మండల పరిషత్‌లో 21 మంది ఎంపీటీసీ సభ్యులు, ఒక కో–ఆప్షన్ మెంబర్ ఉన్నారు. వీరిలో ఏడుగురు సభ్యులు హాజరైతే సమావేశం నిర్వహించడానికి వీలు కలుగుతుంది. కానీ ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి అనారోగ్యం కారణంగా హాజరు కాకపోగా.. అటు ఎంపీటీసీ సభ్యులు, ఇటు అధికారులు సైతం పూర్తిస్థాయిలో హాజరు కాలేదు. వైస్ ఎంపీపీ వంకరాజు, విప్ తిత్రి గుణ సభ్యులందరికీ ఫోన్‌లో సంప్రదించినా ఫలితం లేకపోయింది.

సర్వేలో తప్పులు సరిచేయాలని ఫిర్యాదు


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ ప్రసాద్ తదితరులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూడి జగన్నాథపురం పంచాయతీలో సర్వే నంబర్ 311లో తలెత్తిన భూ సమస్యను పరిష్కరించాలని ఆ గ్రామ సర్పంచ్ బత్తిన ప్రసాదరావు, రైతులు టి.చంద్రయ్య, డి.లక్ష్మి, టి.సుధ, జి.జానకమ్మ తదితరులు తహసీల్దార్ సీతారామయ్యకు బుధవారం ఫిర్యాదు చేశారు. తాము గ్రామంలోని పెద్దల సమక్షంలో కళిశెట్టి సోమేశ్వరరావు ఆస్తికి ఈశాన్యంలో బస్ షెల్టర్ నిర్మాణం కోసం ఇటీవల మండల సర్వేయర్ తిరుపతిరావుతో సర్వే నంబరు 311లో సర్వే చేయించామన్నారు. అక్కడ సర్వేలో భూమికి ఇచ్చిన హద్దులకు, తర్వాత అదే సర్వే నంబరు పక్కన గ్రామంలో ఇంకో రైతు తిమ్మల కృష్ణారావు ఆస్తికి సంబంధించి చేపట్టిన సర్వే హద్దులకు పొంతన లేదన్నారు. దీని వలన గ్రామంలో తగాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందువలన మరలా పూర్తిస్థాయిలో సర్వే చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరారు.

గురుకులంలో కలెక్టర్ తనిఖీలు


సరుకుల నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కంచిలి: మండల కేంద్రం కంచిలిలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి రూ.8లక్షలు నిధులు మంజూరు చేశారు. పలాసలో జరిగిన సమావేశం నుంచి ఆకస్మికంగా ఇక్కడికి విచ్చేసి మౌలిక వసతులు, క్రీడా పరికరాలు, అసంపూర్తి భవనాలపై ఆరా తీశారు. విద్యార్థుల, భోజనాలు, డార్మిటరీల సమస్యలపై ప్రిన్సిపాల్ పేడాడ శ్రీనివాసరావుతో చర్చించారు. విద్యార్థులకు అందిస్తున్న అరటిపండ్ల సైజు చిన్నగా ఉండటంతో కాంట్రాక్టర్‌కు మెమో జారీ చేస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎంపీడీఓ వి.తిరుమలరావు, ఎంఈఓలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు, పంచాయతీ సెక్రటరీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సరఫరాకు అంతరాయం నేడు

టెక్కలి: మేజర్ పంచాయతీ పరిధిలో గురువారం మంచినీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని పంచాయతీ ఈవో ఏవీ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర రక్షిత మంచినీటి పథకం పైప్‌లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం మంచినీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. అయితే బుధవారం సైతం మంచినీరు సరఫరా కాకపోవడంతో పాటు అదనంగా మరోరోజు సరఫరా ఉండదని పంచాయతీ యంత్రాంగం ప్రకటన నేపథ్యంలో పంచాయతీ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

సేఫ్టీ దుస్తులు పంపిణీ


సేఫ్టీ దుస్తుల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులు

ఇచ్ఛాపురం రూరల్: మంచి భోజనంతోనే విద్యార్థులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని హెచ్ఎం కొత్తపల్లి సుహాశ్ చంద్ అన్నారు. మండలంలోని ఎం.తోటూరు ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు ఆయన తన సొంత నిధులతో సేఫ్టీ డ్రెస్‌లు బుధవారం పంపిణీ చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

టెక్కలి: మండలంలోని పలు గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ నరసింహకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోర్టు రోడ్డులో విద్యుత్ లైన్ల మార్పు కారణంగా తలగాం, బిర్లంగిపేట, రెయ్యిపేట, బంజీరుపేట, పెద్దరోక్కళ్లపల్లి, సీతారాంపల్లి, రామనగరం తదితర గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వెల్లడించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఇచ్ఛాపురం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పలాస విద్యుత్ ఈఈ జి.యజ్ఞేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పట్టణ పరిధిలోని గొల్లవీధి, రత్తకన్న, వీకేపేట, ఏఎస్‌పేట, పురుషోత్తపురం, మండలం పరిధిలోని మండపల్లి, మండపల్లికాలనీ, కేదారిపురం గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

సోంపేట: స్థానిక సబ్‌స్టేషన్ పరిధి 11 కేవీ సోంపేట టౌన్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల పనులు నిర్వహిస్తున్న కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పలాస ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యజ్ఞేశ్వరరావు తెలిపారు. సోంపేట సబ్‌స్టేషన్ పరిధి జింకిభద్ర, బెంకిలి, సోంపేట పంచాయతీల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మోక్షమెన్నడో..!


అంపురం – ఘాటీ ముకుందాపురం రోడ్డు మార్గంలో వాహనదారుల అవస్థలు ఇలా..

- అధ్వానంగా ఏజీ రోడ్డు
- అడుగడుగునా గోతులతో అవస్థలు
- పట్టించుకోని అధికారులు

కంచిలి: మండలం మీదుగా ఒడిశా గ్రామాలకు వెళ్లే ప్రాధాన్యత కలిగిన ఏజీ రోడ్డు దారుణంగా తయారైంది. ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో ఉండే ఈ రోడ్డుమార్గం దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఈ రోడ్డు మార్గాన్ని రెండు లైన్ల రహదారిగా అభివృద్ధి చేస్తామని నేతలు చేసిన ప్రకటనలు నీటిమూటలయ్యాయి. సుమారు 12 కిలోమీటర్లు ఆంధ్రా భూభాగంలో ఈ రోడ్డు మార్గం అడుగడుగునా గోతులమయంగా మారింది. కంచిలి మండలానికి చెందిన 10 పంచాయతీలతోపాటు, ఒడిశా పరిధిలో మరిన్ని గ్రామాలు ప్రయాణ అవసరాలకు ఈ రోడ్డు మీద ఆధారపడుతున్నారు. కొద్ది నెలల క్రితం ఈ రోడ్డు మార్గంలో గోతులు పూడ్చేందుకు ఆర్అండ్‌బీ శాఖ రూ.32 లక్షల నిధులతో రెండు భాగాల్లో మరమ్మతుల పనులు చేపట్టింది. అయితే దీనిలో భాగంగా కర్తలి గ్రామం నుంచి అంపురం జంక్షన్ వరకు చేపట్టిన మరమ్మతుల పనులు దారుణంగా ఉన్నాయి. ఇక్కడ పూర్తిస్థాయిలో పనులు చేపట్టకపోవడంతో ఎక్కడి గోతులు అక్కడే ఉన్నాయి. దీంతో వర్షం కురిస్తే గోతుల్లో నీరు చేరుతోంది. ఫలితంగా ప్రయాణికులు ప్రమాదాలబారిన పడుతున్నారు. అందువలన ఇప్పటికైనా ఈ రోడ్డు ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని పాలకులు అభివృద్ధికి దోహదపడాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

ఈ రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దీనికోసం రూ.1.80 కోట్ల నిధులకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైతే రోడ్డు నిర్మాణ పనులు చేపడతాం.

– డి.విక్రమ్, ఆర్అండ్‌బీ ఏఈ, సోంపేట


అంపురం గ్రామం వద్ద రోడ్డు దుస్థితి

రోడ్లపై నిలిచిన నీరు

ఇచ్ఛాపురం: పట్టణంలో బుధవారం కురిసిన జోరువానకి పురపాలక సంఘంలో కాలువలు నిండిపోయి రోడ్లపై, వీధుల్లో ఎక్కడికక్కడే వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడి పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


రోడ్డుపై నిలిచిపోయిన వర్షపునీరు